REGD. NO. A. 40 విడి ప్రతి 0-3-0 శుక్రవారం 8-1-60

# జమీన్ రైతు

సంస్థాపకులు : నెల్లూరు వెంకట్రామా నాయుడు

సంపుటి 32 * సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి * సంచిక 2

## క్రొత్త మంత్రులెవరు?

నాయకుడెవరన్నది నిర్ణయమైపోయింది గనుక, యిక మంత్రులెవరన్నది వూహాగానాలు ప్రారంభమైనవి. నాయకుని నిర్ణయం ఎంత క్లిష్టమైనదో, అంతకంటె సంక్లిష్ట సమస్య మంత్రుల నెన్నుకోవడం. సంజీవయ్యగారి మంత్రివర్గ సభ్యులసంఖ్య పదిహేనుగా వుంటుందని వూహ. ప్రస్తుత మంత్రులలో ఎవరెవరుంటారో తెలియదు. కాని కె. వి. రంగారెడ్డి, బ్రహ్మానందరెడ్డి గారలుమాత్రం ఖాయమైన సభ్యులు.

క్రొత్తగా తీసుకోబడేవారి జాబితాలో అల్లూరు సత్యనారాయణరాజు, కల్లూరు చంద్రమౌళి, పిడతల రంగారెడ్డి, పళ్లంరాజు, పి. వి. జి. రాజు, ఎ. సి. సుబ్బారెడ్డి, పి. బసిరెడ్డి, నూకల రామచంద్రారెడ్డి, పి. వి. నరసింహారావు, కొండా లక్ష్మణ, శ్రీమతి మసూమాబేగం, లక్ష్మీకాంతమ్మగారల పేర్లు వున్నవి.

10 తేది సంజీవరెడ్డిగారి మంత్రివర్గం నిష్క్రమిస్తుంది. బహుశా 11 తేదీననే సంజీవయ్య మంత్రివర్గం అధికార స్వీకారం చేయవచ్చునని తెలుస్తున్నది.

# ముఖ్యమంత్రిగా 'అజాతశత్రువు' శ్రీ సంజీవయ్య

## నాయకత్వానికి జరుగుతుండిన ప్రచ్ఛన్నయుద్ధం సుఖాంతం!

### ఏకగ్రీవ నిర్ణయంతో—

### రాజుగారు పంతం నెగ్గించుకున్నారు

### రెడ్డిగారు ప్రతిష్ఠ కాపాడుకున్నారు

శాసనసభ కాంగ్రెస్ పార్టీ నాయకుని నిర్ణయం ఆశ్చర్యకరమైన పరిణామాన్ని పొందింది. అటు కె. వి. రంగారెడ్డి, బ్రహ్మానందరెడ్డిగాని; యిటు అల్లూరు సత్యనారాయణ రాజుగారుగాని గాకుండా, రాజీగా, వూహించని శ్రీ దామోదరం సంజీవయ్యగారు నాయకుడుగా అందరికీ ఆమోదయోగ్యుడైన అభ్యర్థిగా వరింపబడ్డారు. శుభం!

*

ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డిగారు పదేపదే చెప్పినట్లు నాయకుని నిర్ణయం ఏకగ్రీవంగానే జరిపించి, తన మాటను కాపాడుకున్నారు; అఖిలభారత రంగంలో తన ప్రతిష్ఠను పెంచుకున్నారు. ఏ రాష్ట్రంలోగూడా ఏ అగ్ర



శ్రీ దామోదరం సంజీవయ్య

నివసిస్తుండినది. పీటికి తగినట్లుగా, సంజీవయ్యగారు సత్యనారాయణ రాజుగారి అభ్యర్థిత్వాన్ని బలపరుస్తుండినారు. ఈ కారణాలవల్లనే, నాయకుడుగా సంజీవయ్యగారి పేరు రాజుగారినుండి వచ్చివుంటుందేగాని, సంజీవరెడ్డిగారి నుండి కాదని యిత్రిం దృఢంగా

### భావ తరంగాలు

మా రాజకీయ పరిశీలకుడు

నాయకునికి సాధ్యంకాని పనిని తన రాష్ట్రంలో చేసి చూపిన ఖ్యాతితో శ్రీ సంజీవరెడ్డి కాంగ్రెస్ అధ్యక్ష పీఠాన్ని అలంకరిస్తున్నాడు. సంజీవరెడ్డిగారి కాంగ్రెస్ అధ్యక్షత యీ శుభ పరిణామంతో ప్రారంభమవుతున్నది.

*

ఇంతకూ యీ నాయకత్వ 'రేస్'లో విజయంఎవరిది? సంజీవరెడ్డిదా? సత్యనారాయణ రాజుగారిదా? ఈ ప్రశ్న చర్చించదగినంత అవసరమైంది గాకపోయినా, ఆసక్తికరమైనదిమాత్రం గాదు.

ఈ నాయకత్వ పోటీలో సంజీవయ్యగారు సత్యనారాయణ రాజుగారి పక్షం వహించినారని వినికిడి. నాయకుడుగా సంజీవయ్యగారి పేరు ప్రతిపాదనగూడా సత్యనారాయణ రాజుగారే చేసినట్లు పత్రికల వార్తలు.

అసలు యిటీవల సంజీవరెడ్డిగారికి సంజీవయ్యగారంటే సద్భావం లేదనే వదంతి ఒకటి వ్యాపించివుండినది. అందువల్లనే సంజీవయ్యగారికున్న ప్లానింగు వంటి ముఖ్య శాఖను తీసివేశారనిగూడా రాజకీయ వర్గాలలో

### హైదరాబాదు లేఖ

## నాయకత్వ ఎన్నిక - రెండు వార్తా సంస్థల పరస్పర విరుద్ధ ప్రసారాలు

హైదరాబాదు, జనవరి 4,

ఢిల్లీనుంచి తిరిగివచ్చిన కాంగ్రెసు నూతన అధ్యక్షుడు శ్రీ నీలం సంజీవరెడ్డి, ఏమి చెప్పినప్పటికీ ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు శాసనసభా నాయకత్వానికి పోటీ జరగక తప్పదన్నట్లే కనపడుతున్నది.

నాయకుని ఎన్నిక ఏకగ్రీవంగానే జరుగుతుంది. నేనుకాని అల్లూరి సత్యనారాయణ రాజు కాని ఈ ఏకగ్రీవతకోసం కృషి చేస్తున్నామని సంజీవరెడ్డి చెప్పారు. ఫలానివారికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయి అన్నప్పుడు ఏకగ్రీవతకు స్థానం వుండదు. కనుక అలా పేర్లు సూచించదం తగదనే అభిప్రాయాన్నికూడా ఆయన వ్యక్తం చేశారు.

ఆయన భారతరాజధానినుంచి తిరిగివచ్చిన మరునాడే శ్రీ సత్యనారాయణరాజుకూడా వచ్చారు. వీరిద్దరికీ మధ్య ఇక్కడ రెండు రోజాలపాటు సంభాషణలు జరిగాయని, ఇవి వైఫల్యం చెందాయనీ, ఇక పోటీ తప్పదనీ, అల్లూరివారి సన్నిహితులు చెబుతున్నారు. పోటీజరిగితే, కొండా వెంకటరంగారెడ్డి; అల్లూరివార్ల మధ్యనే జరుగుతుందనికూడా తెలుస్తోంది. సంజీవరెడ్డిగారు, తెలంగాణాలోని ప్రముఖ శాసనసభ్యులను పిలచి రంగా

రెడ్డిగారికి తాను మద్దతు లేదని చెప్పటమే కాక, మంత్రివర్గంలోని సహచరులకుకూడా ఆయనకోసం కృషి చేయవద్దని చెప్పారనికూడా

—కొంద 12.వ పేజీలో

చెప్పవచ్చునేమో!

అందువల్ల యీ నాయకత్వ 'రేస్'లో సంజీవరెడ్డి, సత్యనారాయణ రాజుగారలిరువురూ విజయులే; యిరువురూ పరాజయులే. తాను రాలేకపోయినా తన అభ్యర్థి నాయకుడు గావడం సత్యనారాయణ రాజుగారికి విజయమైతే; తన అభ్యర్థిని నాయకుని చేయలేకపోయినా, అఖిలభారత రంగంలో తన నాయకత్వాన్ని గౌరవప్రదముగా, శక్తివంతముగా చేసుకోవడంతో శ్రీ సంజీవరెడ్డిగారు విజయుడైనారు. ఈ విధంగా యీ కలియుగ "కృష్ణార్జునుల" (అమధ్య పత్రికలు సంజీవరెడ్డి, సత్యనారాయణరాజుగారిల అపూర్వ మిత్రత్వాన్నిజూచి మురిసిపోయి కృష్ణార్జునులని వర్ణించినవిలెండి!) ప్రచ్ఛన్న యుద్ధం యీ విధంగా సుఖాంతమైంది.

సంజీవయ్యగారు భారతదేశంలో ముఖ్యమంత్రిత్వాన్ని ఆక్రమిస్తున్న ప్రథమ హరిజనుడు. అంతేగాదు, అందరు ముఖ్యమంత్రులలోకి వయస్సులో చిన్నవాడు (38 సంవత్సరాలు). ప్రకాశంగారు ఒక ముఖ్యమంత్రిక్రింద; గోపాలరెడ్డి, సంజీవరెడ్డిగారలు ముగ్గురు ముఖ్యమంత్రుల క్రింద మంత్రులుగా పనిచేసి ముఖ్యమంత్రులైతే; సంజీవయ్యగారు నలుగురు ముఖ్యమంత్రుల క్రింద పనిచేసి ముఖ్యమంత్రి అవుతున్నారు.

—కొంద 12 వ పేజీలో

ఫోను : 280. గ్రామ్సు : నిర్మల.

నిర్మల

| | | |
| --- | --- | --- |
| స్పెషల్ పక్కాపొడి | 1 వీశ | రూ. 12—00 |
| ప్లాంటేషను కాఫీపొడి | 1 పౌ. | 3—25 |
| స్పెషల్ కాఫీపొడి | 1 పౌ. | 3—50 |
| హోటల్ స్పెషల్ | 1 పౌ. | 3—25 |

అన్నిరకముల కాఫీగింజలు - అధునాతనమైన ఫ్యాన్సీసామానులు సరసమైన ధరలకు దొరకును.

నిర్మలా కాఫీ వర్క్సు

ట్రంకురోడ్డు—నెల్లూరు

# ఇతర జిల్లాలు

## భీమునిపట్నం ఉపఎన్నిక

భీమునిపట్నం నియోజకవర్గంనుండి ఆంధ్ర శాసనసభకు జరుగుతున్న ఉపఎన్నికలో, కాంగ్రెసు అభ్యర్థిగా శ్రీ పి. వి. జి. రాజాగారు (విజయనగరం రాజా గారు) కాంగ్రెసు అభ్యర్థిగా; శ్రీయుతులు పి. వి. కృష్ణమూర్తిగారు, టి. స్వామినాయుడు స్వతంత్రులుగా నామినేషన్లు వేశారు. ఉపసంహరణకు ఆఖరి గడువు 7 వ తేది. పోలింగ్ యీనెల 28 వ తేది. పోటీ చేసే అభ్యర్థులలో ఎవరు ఉపసంహరించుకుంటారో యింకా తేలలేదు. రాజాగారికి పోటీ పెట్టాలని తలపోస్తుండిన కమ్యూనిస్టుపార్టీ పోటీ చేయకపోవడం ఆశ్చర్యకరం. రాజాగారితో తలపడటం చిన్న విషయం కాదని క. పార్టీ భావించి వుండవచ్చు. కేరళలో తమ ధన వ్యవస్థ కూలబోతున్న సమయంలో, భీమునిపట్నంలో పోటీచేసి ఓడిపోతే, దీని ప్రభావం కేరళమీద పడుతుందనే భయమే, కమ్యూనిస్టులను పోటీచేయడానికి వెనుకాడేటట్లు చేసి వుంటుంది.

## విజయవాడ కాఫీహోటళ్లలో ధరలు హెచ్చింపు

ఈ వారం విజయవాడ కాఫీహోటళ్లలో కాఫీ, యిడ్లీ, మినపట్టు, పెసరట్టుల ధరలను, 12 న. పై. ల నుండి 15 న. పై. హెచ్చించడం, పెద్ద ఆందోళన కల్గించింది. ఇదివరలో యిక్కడ కాఫీధర 0-2-0 నుండి 0-2-3 కి పెంచారు. కాని ప్రజలు హోటళ్లకు రావడం తగ్గిపోయేసరికి కాఫీధర యధాప్రకారం వుంచారు. విజయవాడ కాఫీహోటళ్ల ధరల హెచ్చింపును, నిన్నటి నెలలో తగ్గించిన టిక్కెట్టు క్రింద విజయవాడ పత్రికలు "ఇండియన్ ఎక్స్‌ప్రెస్" వంటివి ప్రాముఖ్యంగా ప్రకటించడమే యీ ధరల హెచ్చింపువల్ల విజయవాడ ప్రజల ఆందోళన వ్యక్తమౌతున్నది.

నెల్లూరులో కాఫీ అరకప్పు 16 న.పై.లు, యిడ్లీ 7 న.పై.లకు పెంచితే, ఎవరంతటవారు అక్రమమనుకున్నారే గాని, విజయవాడ ఆందోళన యిక్కడలేదు!

## కోనసీమకు క్రొత్తహంగు

కోనసీమ ప్రజలు, గోదావరి రెండుపాయల ఉపనదుల గొలుసు, వశిష్టల మధ్య చిక్కుకున్నందువల్ల, రాష్ట్రంలోని యితర ప్రాంతాలవారితో సంబంధాలు తెగిపోయేవి. కాని కలకత్తా – మద్రాసు రోడ్డుపైనున్న సిద్ధాంతంవద్ద వశిష్టానదిపై బ్రిడ్జి నిర్మాణంతో కోనసీమవారి కష్టాలు యీడేరడమే కాకుండా క్రొత్తహంగు ఏర్పడినట్లవుతుంది. ఈ బ్రిడ్జి మొత్తం పొడవు 3132 అడుగులు. రు. 94 లక్షల ఖర్చుతో నిర్మిస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణం మూడేండ్లలో పూర్తికాగలదట. మొన్న 4 తేది ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి దీనికి శంకుస్థాపన చేశారు. శ్రీ కళా వెంకటరావు సజీవులైవుంటే, వశిష్ట బ్రిడ్జి నిర్మాణానికి ఎంతో సంతోషించి వుండేవారు!

## సింహం బుర్రకథ



స్వర్గీయ హరినాథ్ గారి పిల్లలు చిరంజీవులు సింహం (16), లక్ష్మి (11), కృష్ణ (9) ల బుర్రకథా ప్రదర్శనాన్ని వినే అవకాశం కలిగింది. వయసుకు మించిన ప్రతిభతో వుండినది వీరి ప్రదర్శనం.

ఇందులో కథకుడు సింహం. తక్కిన యిద్దరు వంతపాడారు. వీరు రుద్రమదేవి, పల్నాటి యుద్ధం కథలు చెప్పారు. రుద్రమదేవి ఎట్లున్నా; పల్నాటివీరులు ఒకరొకరిని శ్రోతలముందు నిల్పి, మనలోకూడా పౌరుషాన్ని పుట్టుకాన్ని రేకెత్తించచేసి, నాయకురాలిపట్ల ద్వేషాన్ని, బ్రహ్మనాయుని పట్ల సానుభూతి గౌరవభావాలను, బాలచంద్రుని వీరమరణం పట్లశోకాన్ని, గర్వాన్ని కల్గించగలిగారు యీ బాలకథకులు. ఇందులో తొమ్మిదేళ్ల బాలుడు కృష్ణ ముద్దుముఖంతో మాచ్చటగా మున్షిక హాస్యం చిందించడం శ్రోతలను ఆశ్చర్యంలో ఆకర్షించింది. కళలలో వీరు అనతికాలంలో వున్నతస్థితికి రాగలరనేది మనం చెప్పవలసిన అవసరం లేదు. వీరికి యింత చక్కని శిక్షణ నిచ్చిన శ్రీ రామాచారి (నటశాస్త్రాచారి) అభినందనీయుడు. విద్యాసంస్థలు వీరి ప్రదర్శనాలను ఏర్పాటుచేసి ప్రోత్సహించ దగివుంటుంది.

—ఒక విలేఖరి.

## కొత్తగూడెం ఎరువులఫ్యాక్టరీ

కొత్తగూడెంలో రు. 25 కోట్లతో ఏర్పాటుకానున్న రసాయనిక ఎరువుల ఫ్యాక్టరీకి, మన పరిశ్రమల శాఖ కార్యదర్శి శ్రీ పి. యం. నాయక్‌ను మేనేజింగ్ డైరక్టరుగా నియమిస్తారనుకుంటున్నారు. డైరక్టర్ల జాబితా తయారైందట కాని, నాయకత్వ ఎన్నిక రథసలో, ఆ విషయం మరుగున పడిపోయినట్లున్నది.

## ఇండ్లు—భూములు వేలం

నెటు కందర్ల లక్ష్మీనారాయణశెట్టి ఎస్టేటు తాలూకు యిండ్లు—భూములు 9-1-60 తేది (శనివారము) మధ్యాహ్నము 2 గంటలకు అఫిషియల్ రిసీవరువారి ఆఫీసులో వేలము వేయబడును.

—ఎ. యల్. శాస్త్రి.
అఫిషియల్ రిసీవరు. నెల్లూరు.


# 5 మణుగుల నుండి 50 మణుగులు....

షేక్ అబ్దుల్ గఫార్. అతని అయిదుగురు సోదరులు కూడి ఒకే ఎకరం భూమిలో సాధించిన విజయమిది. ఏమిటి దీనిలోని కీలకం? ఆధునిక పద్ధతులతో సమిష్టి వ్యవసాయం.

సాధించగలమనే దృఢసంకల్పంతో, బీహారులోని వాట్‌గంజ్ గ్రామానికి చెందిన ఈ వ్యవసాయదారులు ఆధునిక పద్ధతులలో, మేలు రకం విత్తులు వరుసగా చల్లి, తగు మాత్రంగా ఎరువులు వాడారు. నూతన పరికరాల సహాయంతో 40 ఎకరాల భూమిని సమిష్టిగా సాగుచేశారు - ఇదంతా వారి స్వయంకృషి.

ఫలితం: పాతకాలపు పద్ధతులలో వారు ఎకరానికి నాలుగయిదు మణుగుల కంటె వరిగాని, గోధుమగాని పండించగలిగేవారు కారు. కాని ఇప్పుడు నూతన పద్ధతులు అవలంబించడం వలన ఎకరానికి 40 నుండి 50 మణుగుల వరకు పంట తీస్తున్నారు.

మీ పొలంలో కూడా మీరు ఎక్కువ పండించగలరు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించండి, అధికంగా పండించండి. ప్రజలకు చాలినంత ఆహారం అందీయండి.

ప్రణాళికకు సహకార మివ్వండి
మీ మేలుకు మీరు కృషి చేయండి



# హైదరాబాదు లేఖ

(మొదటిపేజీ తరువాయి)

అతి విశ్వసనీయంగా తెలుస్తున్నది. విన్న, ఈ కేక శాసన సభ్యుల వసతి గృహాల్లో ఈ విషయమై తీవ్రంగా ప్రచారం ఆరంభమైంది కూడా.

ఈ విధంగా చివరకి రంగారెడ్డిగారికే అనుకూలంగా ముఖ్యమంత్రి మారడానికి, రంగారెడ్డిగారి సహచరులైన దాదాపు 30 మంది తెలంగాణా శాసనసభ్యులు, తెలంగాణా ప్రాంతీయ సంఘాధ్యక్షులైన శ్రీ అచ్యుతరెడ్డితోసహా రంగారెడ్డిగారు అధ్యక్షులు అవుతే ముఖ్యమంత్రి పదవోను పాటిస్తాము కాని బ్రహ్మానందరెడ్డిగారు కాని ఇతర్లు ఎవరైనా కాని అధ్యక్షులు అవుతే బలపరచమని స్పష్టంగా సంజీవరెడ్డిగారికి చెప్పివేయడమే కారణమని తెలుస్తున్నది. వీరీ విధమైన వైఖరి నవలంబించడానికి కారణంకూడా, తెలంగాణా నాయకుడు ముఖ్యమంత్రి స్థానంలో వుంటేతప్ప, తెలంగాణాకు న్యాయం జరగదని, గత మూడు సంవత్సరాల అనుభవం దృష్ట్యా నమ్ముతూ ఉండడమేనని వీరు చెబుతున్నారు.

పరిస్థితి ఇలా పరిణమించినప్పుడు పార్టీలో ఎవరికి అనుకూలంగా అధిక సంఖ్యాకులు ఉన్నారనే విషయాన్ని తెలుసుకోటండుకు బహిరంగ ఎన్నికకాక మరేదైనా మార్గం, పద్ధతి అవలంబించి, ఆ తరువాత ఎన్నికను ఏకగ్రీవంగా జరిపించి, కొత్త కాంగ్రెసు అధ్యక్షునికి, అందరికీ మాట దక్కేట్టు చేయవలసి ఉంటుంది. చివరకి జరగేదింతేనేమో.

ఏది జరిగినప్పటికీ, మనదేశంలో పత్రికల ప్రధానమైన వార్తాసంస్థ ఈ ఎన్నిక ధర్మమా అని చిక్కుల్లో పడ్డాయి. అల్లూరి సత్యనారాయణరాజుగారికే అధికంగా అవకాశాలు ఉన్నాయని ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా రెండుసార్లు ఢిల్లీనుంచి వార్తలను విడుదల చేసింది. మొదటిసారి సంజీవరెడ్డిగారు కాంగ్రెసు అధ్యక్ష స్థానానికి పోటీచేయాలని కాంగ్రెసు అగ్రనాయకులు నిర్ణయించినప్పుడు, రెండవసారి డిశంబరు 30, 31 తేదుల్లో కాంగ్రెసు కార్యవర్గం, కేంద్ర పార్లమెంటరీబోర్డు సమావేశాలు జరిగినప్పుడు.

కార్యవర్గంలోను, పార్లమెంటరీబోర్డులోను ఆంధ్ర కొత్త ముఖ్యమంత్రి విషయమై కూలంకషంగా చర్చ జరిగినదనీ, శ్రీ అల్లూరి ఏకగ్రీవంగా ఎన్నిక కావడానికి శ్రీ సంజీవరెడ్డి యత్నిస్తున్నారని రెండవసారి విడుదల చేసిన వార్తలో ఉంది. ఈ వార్తనే ముఖ్యమంత్రి "అబద్ధం, దురుద్దేశపూరితం. నిరాధారం" అని వర్ణించారు. తమ ఢిల్లీ కార్యాలయం వార్తను ఖండిస్తున్న ముఖ్యమంత్రి ప్రకటనను ఎలా విడుదలచేయాలో తెలియక స్థానిక పి. టి. ఐ. కార్యాలయం బొంబయి ప్రధాన కార్యాలయానికి జరిగినదంతా వివరించింది. ఢిల్లీ, బొంబయి, హైదరాబాదుల మధ్య సంప్రదింపులు టెలిప్రింటరుమీద జరిగిన పిమ్మట, 6 గంటల వ్యవధి అనంతరం, పార్లమెంటరీబోర్డులో ఆంధ్రముఖ్యమంత్రి వ్యవహారం చర్చకు రాలేదని సంజీవరెడ్డిగారు చెప్పారు అంటూ ఒక వార్తను విడుదల చేశారు.

"హిందూస్థాన్ టైమ్సు" లో ఎంతో కాలంగా పనిచేసి "ఇన్నాఫ్" పేరుతో ఢిల్లీ డైరీ శీర్షిక క్రింద ఎన్నో 'న్యూస్' ప్రకటిస్తూవచ్చిన దుర్గాదాస్ గారు 'టైమ్సు' నుంచి విరమించుకున్న తరువాత ఇండియన్ న్యూస్ ఎండ్ ఫీచర్ ఎలయన్సు సంస్థను ప్రారంభించారు. దీనికి కాంగ్రెసు నాయకులలో కొందరు మంత్రులు సహాయం, కనీసం నైతికంగా, చేస్తున్నారని వినికిడి. ఈ సంస్థ వారుకూడా ఆంధ్రముఖ్యమంత్రి వారసుని విషయంలో రెండుసార్లు ఊహాగానం చేశారు. రెండుసార్లుకూడా బ్రహ్మానందరెడ్డిగారికే అధికంగా అవకాశం వుందని వ్రాశారు. ఆరోగ్యం సంతృప్తికరంగా లేనందువల్ల శ్రీ అల్లూరి సత్యనారాయణరాజుగారు ఎన్నుకోరు అనికూడా ఉటంకించారు.

ఈ రెండుసంస్థలు విడుదలచేసిన పరస్పర విరుద్ధమైన వార్తలలో దేనిలో నిజమున్నదో తెలియక హైదరాబాదులో రాజకీయ వర్గాలు, సాధారణ పత్రికా పాఠకులు తికమక పడ్డారంటే అతిశయోక్తి కాదు.

# భావతరంగాలు

(మొదటిపేజీ తరువాయి)

1921లో కర్నూలుజిల్లా పెద్దపాడు గ్రామ పల్లెలో జన్మించిన శ్రీ సంజీవయ్య, అనంతపురంలో బి. ఏ. పట్టాన్ని, మద్రాసులో బి. యల్. డిగ్రీని పొంది, కో-ఆపరేటివు జూనియర్ ఇన్‌స్పెక్టరుగా, మద్రాసు సెక్రటేరియట్‌లో గుమాస్తాగా పనిచేసి రాజ్యాంగ నిర్మాణ సభ సభ్యుడుగా ఎన్నికై, 1952లో కర్నూలు నియోజక వర్గంనుండి శాసన సభ్యులై, రాజాజీచే మంత్రిగా తీసుకోబడి, ఆనాటినుండి యీనాటి వరకు మంత్రిగా వుంటున్నారు. గోపాలరెడ్డిగారి తర్వాత యింతకాలం మంత్రిత్వాన్ని వహించిన తెలుగువారు మరొకరు లేరు.

సంజీవయ్యగారి జీవిత విశేషం మరొకటున్నది. వారు రాజ్యాంగసభకు ఎన్నికయ్యేవరకు వారు కాంగ్రెస్ వాదికాదు; స్వాతంత్ర్యోద్యమ పోరాటంలోనూ పాల్గొనలేదు; జైలుకుపోలేదు. ఈ చరిత్రలేని ఏకైక ముఖ్యమంత్రికూడా దేశంలో మన సంజీవయ్యగారుగానే వుంటారు. సంజీవయ్య అదృష్టదేవత ముద్దులపట్టి. ఇంత అదృష్టవంతుడు ఆంధ్ర రాజకీయాలలో లేడనే చెప్పవచ్చు.


సంజీవయ్య అజాతశత్రువు అందరికీ అభిమానపాత్రుడు. శాసనసభ కాంగ్రెస్ పార్టీలోని మూడువందల మందిలో సంజీవయ్యగారంటే వ్యతిరేకి ఒక్కరూ లేరంటే, వారి సహృదయత బోధపడుతుంది.

శ్రీ సంజీవయ్యగారికి మా అభివందనలు.


## కుబేరా మైకామైన్
### లీజుకు ఇవ్వబడును

గూడూరు సమీపం తిప్పవరప్పాడు గ్రామంవద్దవున్న ప్రత్యేకమైన క్వాలిటీ మైకాగల కుబేరా మైకామైన్ లీజుకు యివ్వబడును.

—విస్సా రాజగోపాల్‌రావు,
స్టోన్‌హౌస్‌పేట - నెల్లూరు.


Edited, Printed and Published by N. Sree Ramamurthy at the Zamin Ryot Press, 170 Thipparajuvari Street, Nellore.